సాక్షి ఒడిశా
సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,19,903లు, బంగారం 5 గ్రాములు, వెండి 66 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అకాల వర్షం.. అపార నష్టం

- 8లో▸



భార్యపై బాణంతో దాడిచేసిన భర్త

- 8లో▸

న్యూస్‌రీల్

సూపరింటెండెంట్‌గా సుచిత్ర దాస్



సుచిత్ర దాస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న వైద్యులు

బరంపురం: స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల తొలి మహిళా సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ సుచిత్ర దాస్ బాధ్యతలు చేపట్టారు. శనివారం సాయంత్రం ఎంకేసీజీ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆమెకు వైద్యులు, ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

చరిత్ర సృష్టించిన ఆహాన్



టెన్నిస్ టైటిల్‌తో ఆహాన్

భువనేశ్వర్: రాష్ట్ర టెన్నిస్ క్రీడారంగంలో 13 ఏళ్ల చిన్నారి ఆహాన్ చరిత్ర సృష్టించింది. హైదరాబాద్‌లోని సానియా మీర్జా టెన్నిస్ అకాడమీలో జరిగిన అండర్–16 టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్‌లో విజయం సాధించింది. తమిళనాడుకు చెందిన సవితా భువనేశ్వర్‌ను 6-1, 6-3 పాయింట్ల స్కోరుతో ఓడించి ఏటీపీఏ జాతీయ సిరీస్ అండర్–16 టైటిల్ గెలుచుకుంది.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు తదితరులు

బరంపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు. బరంపురం అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు, నీలకంఠ నగర్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి బరంపురం నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 50 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దండకాళీ యాత్ర ప్రారంభం



కాళీ మందిరం వద్ద ధూలి దొండో ప్రదర్శిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: చైత్రమాసం సందర్భంగా పట్టణంలోని తెలుగు సొండివీధి వద్ద శ్యాం కాళీ ఆవరణలో దండకాళీ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు గంజాం జిల్లా అస్కా బ్లాక్ ధరాకోట్ నుంచి కాళీ భక్తులు విచ్చేసి ఉదయం నగర పరిక్రమ చేశారు. అనేక మంది భక్తులు విరాళాలు, బియ్యం, పప్పులు ఇచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తొలిరోజు ధూలి దొండోను ధరాకోట్ నుంచి విచ్చేసిన భబీస్ దాస్ నేతృత్వంలో ప్రదర్శించారు. అత్యంత కఠిన నియమాలతో కూడిన ఈ దొండోయాత్ర పర్లాకిమిడిలో ఈనెల 14వ తేదీ వరకూ జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

సుందరకాండ పారాయణం



సుందరకాండ పారాయణం చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కోమటి వీధిలోని శ్రీరామ మందిరంలో ఆదివారం ఉదయం సుందరకాండ పారాయణం, హోమం ప్రధాన అర్చకులు ఎ.రాజగోపాలచారి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మమ్మేలు మా తల్లీ.. మజ్జిగౌరి

- కొనసాగుతున్న చైత్రోత్సవాలు
- కొలువుదీరిన ఘటాలు
- అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



అమ్మవారికి సమర్పించిన ప్రత్యేక నైవేద్యాలు



కొలువుదీరిన ఘటాలు



పూజలు చేస్తున్న మహిళలు



పూజల్లో కూర్చున్న కమిటీ సభ్యులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతి రూపాలుగా భావించే ఘటాలు ఆదివారం కొలువుదీరాయి. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఒడిశా, తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేశారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు మందిరం నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నప్పటికీ, దర్శనంలో కొంత ఇబ్బందులు తలెత్తాయి. పలు సంస్థలు భక్తులకు సేవలందించాయి.

అమ్మవారి నగర పరిక్రమణ

అమ్మవారి ఘటాలు కొలువుదీరడంతో ఇకపై నగర పరిక్రమణ చేస్తారు. అమ్మవారికి ప్రతిరూపాలుగా పిలవబడే ఘటాలు ఊరిలోని ప్రతీ వీధిలో తిప్పుతారు. దుష్ట శక్తులను తరిమికొట్టేందుకు అమ్మవారు ప్రతిరోజూ నగర పరిక్రమణ చేస్తారని చరిత్ర చెబుతోంది. చైత్రోత్సవాల్లో నగర పరిక్రమణకు నిర్వాహకులు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వస్తున్నారు. ఆ సమయంలో పాల జంగిడితో పాటు వెనుక మరో మూడు ఘటాలను (కుండలు) మోసుకుంటూ వెళతారు. పూజారి పసుపు, బియ్యంతో కలిపిన బొట్టును ప్రతీ ఒక్కరికీ పంచిపెడతారు. చిన్నపిల్లలు ఉండే ఇళ్లలో వారి పిల్లలకు ఈ పసుపు, బియ్యంను తినిపిస్తారు.

అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం

ప్రతిరోజూ అమ్మవారికి నిత్య భోగాలతో పాటు ఉత్సవాల సమయంలో ప్రత్యేకమైన నైవేద్యాలను సమర్పిస్తారు. అమ్మవారికి ఎంతో ఇష్టమైన మరమరాలతో తయారు చేసే ప్రసాదాన్ని సమర్పిస్తారు. అదేవిధంగా పానకం, అటుకులు తదితరమైనవి సమర్పిస్తారు. ఈ సమయంలో పూజారి తప్ప ఎవరినీ లోపలకి అనుమతించరు. అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం లభిస్తుంది.

నేటి నుంచి చండీహోమం

చైత్రోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిత్యపూజలతో పాటు అమ్మవారికి చండీహోమం, పఠన కార్యక్రమాలను నిర్వహిస్తారు. మూడోరోజు నుంచి హోమం ప్రారంభమై ఆఖరి రోజు వరకు కొనసాగుతుంది. ఆఖరి రోజున పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుంది. అనంతరం మల్లెలు తొక్కుట (నిప్పులపై పూజారి నడవడం) వంటి కార్యక్రమాలు ఉంటాయి. వీటిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.



దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న అమ్మవారి ప్రాంగణం

ఆర్గానిక్ వ్యవసాయంపై సమ్మేళనం



సెమినార్‌లో పాల్గొన్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ ఆడిటోరియంలో ఆర్గానిక్ రైతుల జీవికా సమ్మేళనాన్ని ప్రాంతీయ జీవికా, ప్రకృతి వ్యవసాయ కేంద్రం డైరెక్టర్ డా.వీరేంద్రకుమార్ వర్మ ఆదివారం ప్రారంభించారు. సమ్మేళనానికి గౌరవ అతిథులుగా సైంటిఫిక్ అధికారి డాక్టర్ వాచస్పతి పాండే (భువనేశ్వర్), సీయూటీఎం రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, వ్యవసాయ విద్యాలయం డీన్ (అడ్మిన్) డా.ఎస్పీ నందా, డిప్యూటీ రిజిస్ట్రార్ (ట్రైనింగ్) ఎస్.కామేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎటువంటి వరి వంగడాలు, మొక్కజొన్న విత్తనాలు వేసుకోవాలో సూచించారు. విశ్రాంత సీడ్ సర్టిఫికేషన్ అధికారి డాక్టర్ ఏకాదశి నంది, పర్లాకిమిడి కృషి విజ్ఞాన కేంద్రం అధికారి డాక్టర్ సంగ్రాం పరమగురులు మాట్లాడుతూ.. ఆర్గానిక్ వ్యవసాయ విధానంపై వివరించారు. బీబీఏ, ఎంఎస్సీ విద్యార్థులకు డాక్టర్ శుభ్రమయ నాయక్ మార్గదర్శకం చేశారు. భవిష్యత్తులో రైతుల కోసం ఆర్గానిక్ వ్యవసాయంపై మరిన్ని సెమినార్లు నిర్వహిస్తామని డా.సంగ్రాం పరంగురు తెలియజేశారు. సమ్మేళనంలో దాదాపు 500 మంది రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూల్యాంకనం

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల ముగిసిన మెట్రిక్యులేషన్ (పదో తరగతి) పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రి య ఈనెల 15వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగుతుంది. 56 కేంద్రాల్లో జవాబు పత్రాలు దిద్దేందుకు ఏర్పాట్లు చేసినట్లు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. మూల్యాంకనం సక్రమంగా నిర్వహించేందుకు బోర్డు నిబంధనలు జారీ చేసింది.

ధామ్రా పోర్టుకు ఎల్‌ఎన్‌జీ ట్యాంకర్

భువనేశ్వర్: రాష్ట్రంలో ధామ్రా పోర్టుకు తొలిసారిగా లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌ఎన్‌జీ) ట్యాంకర్ చేరింది. దీంతో ఈ రంగంలో కొత్త అధ్యాయం ఆవిష్కారమైందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. ఒడిషా దివస్ నాడు తొలి ఎల్‌ఎన్‌జీ ట్యాంకర్ మిలాహా రాస్ లఫాన్ తీరానికి రావడం విశేషమన్నారు. ఉన్నతమైన ఎల్‌ఎన్‌జీ నిర్వహణతో ధామ్రా ఓడరేవు జాతీయ స్థాయిలో ఎనర్జీ హబ్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

నకిలీ సర్టిఫికెట్లతో దరఖాస్తులు

- తపాలా శాఖ ఉద్యోగాల్లో పరిశీలన



జయపురం ప్రధాన తపాలా కార్యాలయం

జయపురం: తపాలా విభాగంలో గ్రామీణ డాక్ సేవకులు, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు, అదనపు బ్రాంచ్ పోస్టు మాస్టర్ల ఉద్యోగాల కోసం రెండు నెలల క్రితం తపాలా శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. రాష్ట్రంలో వందలాది మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. వాటిలో 32 మంది దరఖాస్తులు వెరిఫికేషన్ కోసం కొరాపుట్ తపాలా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. జిల్లా తపాలా అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. 32 మంది అభ్యర్థుల్లో 22 మంది అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు నకిలీవిగా గుర్తించారు. వాటిలో 13 ఉత్తరప్రదేశ్ హైస్కూల్ బోర్డు, ఇంటర్మీడియట్ పరీక్షల్లో పాసైన సర్టిఫికెట్లు కాగా, మిగతా 9 ఒడిశా బోర్డు నకిలీ సర్టిఫికెట్లుగా తేల్చారు. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినవారిలో అవిభక్త కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితిలో ఇద్దరు, కొరాపుట్ పట్టణంలో ఇద్దరు, ఎ.మల్కన్‌గిరి ఓఎంపీ లైన్‌లో ఇద్దరు, సెమిలిగుడ సమితిలో ఒకరు, నవరంగపూర్ జిల్లా కొడింగలో ఒకరు, రాయిఘర్‌లో ఒకరు, మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండలో ఇద్దరు, కలహండి జిల్లాలో ఒకరు, కందమాల జిల్లాలో ఇద్దరు, భద్రక్ జిల్లాలలో ఇద్దరు, మయూర్‌భంజ్ జిల్లాలో 6 మంది ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కొరాపుట్ సదర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై తపాలా విభాగం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ మనోజ్ ప్రగడ తెలిపిన వివరాల మేరకు.. 32 మంది సర్టిఫికెట్లు తనిఖీ చేసినప్పుడు ఒడియాలో మార్కులు ఉండడం చూసి అనుమానం వచ్చిందన్నారు. వెంటనే ఆన్‌లైన్‌లో డిజీ లాకర్ సాయం తీసుకున్నామని, అక్కడ ఎటువంటి రిపోర్టు రాలేదని దీంతో ఆ సర్టిఫికెట్లు నకిలీవని స్పష్టమైందని వెల్లడించారు. వెంటనే గత నెల 28వ తేదీన కొరాపుట్ ఎస్పీకి లిఖిత రిపోర్టు సమర్పించామని, దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెల్లడిస్తారని చెప్పారు.

విషాదం

- నో బాల్ ప్రకటించడంతో అంపైర్ హత్య

భువనేశ్వర్: క్రికెట్‌లో నో బాల్ ప్రకటించడంతో అంపైర్‌ను హత్య చేసిన ఘటన కటక్ చౌద్వార్ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చౌద్వార్ మహిషానంద ప్రాంతంలో రెండు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా అంపైర్ లక్కీ రౌత్ (22) నో బాల్ ప్రకటించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకించిన బౌలింగ్ జట్టు క్రికెటర్లు దాడికి పాల్పడ్డారు. బ్యాట్, కత్తులతో అంపైర్‌ను తీవ్రంగా గాయపరిచారు. దీంతో అంపైర్ పరిస్థితి విషమం కావడంతో హుటాహుటిన కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స జరుగుతుండగా చనిపోయినట్లు డాక్టర్ ప్రకటించారు. దాడి చేసిన యువకుడిని గ్రామస్తులు అదుపులోకి తీసుకున్నారు. చౌద్వార్ ఠాణా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులను మోహరించారు. క్రికెట్ క్రీడలో అంపైర్‌పై దాడికి పాల్పడిన ఘటన ఒడిశాలో ఇదే తొలిసారిగా చర్చ సాగుతోంది.

రూ.160 కోట్లతో కొటియా అభివృద్ధి

- బీజేడీ మాజీ ఎంపీ ప్రదీప్ మఝి



మాట్లాడుతున్న ప్రదీప్ మఝి తదితరులు

జయపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సుమారు రూ.160 కోట్లతో కొటియా అభివృద్ధి పనులు చేపట్టారని బీజేడీ మాజీ ఎంపీ ప్రదీప్ మఝి అన్నారు. ఉత్కళ దివస్‌లో భాగంగా వివాదస్పద కొటియ గ్రామాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం సందర్శించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రదీప్ మఝి జయపురంలో ఆదివారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్రమంత్రిపై ధ్వజమెత్తారు. ధర్మేంద్ర ప్రధాన్ కొటియా సందర్శన నామమాత్రమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొరాపుట్ అభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు. కొరాపుట్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించేందుకే ధర్మేంద్ర ప్రధాన్ సందర్శించారని ఆరోపించారు. కొటియా వివాదం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం ఆయన మాట్లాడలేదని గుర్తు చేశారు. రాష్ట్రం ప్రభుత్వం రోడ్లు, తాగునీటి వనరులు, వైద్య సౌకర్యాలు, బిజూ ఆరోగ్య కల్యాణ పథకం, ప్రాథమిక విద్యావ్యవస్థ, విద్యుత్ సౌకర్యం, 5–టీ స్కూళ్ల ఏర్పాటు చేస్తోందని వివరించారు. అలాగే ఉన్నత విద్య కోసం జయపురం విక్రమదేవ్ కళాశాలను విక్రమ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన ఘనత సీఎం నవీన్‌ది అన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఉన్న దురువ, ఝొడువ గిరిజన సాంప్రదాయ ప్రజలకు ఆదివాసీ గుర్తింపు నేటికీ కేంద్రం ఇవ్వలేదని ఆరోపించారు. సమావేశంలో జిల్లా ఛాత్ర బీజేడీ అధ్యక్షుడు ఆశిష్ పండ, జయపురం పట్టణ బీజేడీ అధ్యక్షుడు హరమిశ్రలు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌సీ రైల్వే కాలనీలో చోరీ



తలుపులను కట్టర్ సాయంతో తొలగించిన దృశ్యం



చిందరవందరగా బీరువాలో సామాన్లు

రాయగడ: స్థానిక ఎస్ఎన్‌సీ రైల్వే కాలనీలో నివసిస్తున్న ప్రశాంత్ మండల్ అనే వ్యక్తి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఇంటి వెనకాల ఇనుప తలుపును కటింగ్ యంత్రాలతో తొలగించిన దుండగులు ఇంటిలో చొరబడి బీరువాలో రూ.90 వేల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలతో పాటు మరో రూ.25 వేలు విలువచేసే వెండి ఆభరణాలు దొంగిలించినట్లు బాధితుడు సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఐఐసీ కమలా కాంత్ కుహరో తెలిపిన వివరాలు మేరకు.. వారం రోజుల క్రితం ప్రశాంత్ మండల్ భార్య తన అమ్మగారు ఉంటున్న ఖరగ్‌పూర్‌కు వెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం 10 గంటలకు డ్యూటీకి వెళ్లిన ప్రశాంత్ తిరిగి డ్యూటీ నుంచి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అయితే అప్పటికే ఇనుప తలుపులు విరిగి పడి ఉండడం గమనించి దొంగతనం జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఇటీవల పట్టణంలో దొంగతనాలు పెరుగుతుండడంతో పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హడలెత్తించనున్న వడగాలులు

- పెరగనున్న ఎండల తీవ్రత



భువనేశ్వర్: ఈ వేసవిలో దేశవ్యాప్తంగా వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ విభాగం ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 3 నెలల పాటు వడగాలుల తీవ్రత అసాధారణంగా ఉంటుందని పేర్కొంది. ప్రధానంగా దేశంలో కేంద్ర, తూర్పు, వాయువ్య ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని ముందస్తుగా అంచనా వేసింది. బీహార్, జార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్, ఒడిశా, గంగానది పశ్చిమ బెంగాల్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, పశ్చిమ మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో ఏప్రిల్ నెలలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని స్పష్టం చేసింది.

ఉదయం పూట బడులు

వేసవిలో వడగాడ్పుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉదయం తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నాయి. ఈనెల 11వ తేదీ నుంచి పాఠశాలల్లో ఉదయం పూట తరగతులు నిర్వహణ ప్రారంభమవుతుంది. నిత్యం ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు ఉదయం పూట బడుల వేళలుగా ప్రకటించారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, అవసరమైన మార్పులు చేయాలని కలెక్టర్లకు ప్రత్యేకంగా సూచించారు. వేసవిలో పాఠశాలల్లో విద్యార్థులకు వడదెబ్బ నివారణ నేపథ్యంలో తాగునీరు ఇతర అనుబంధ సౌకర్యాలు కల్పించాలని విద్యా విభాగం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో కొత్త విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

పొరుగు రాష్ట్రాలకు పుస్తకాల పంపిణీ

రాష్ట్రేతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ విద్యాభ్యాసం పొందుతున్న ఒడియా అభ్యర్థుల కోసం ప్రభుత్వం అచ్చు పుస్తకాలు పంపిణీ చేసింది. గుజరాత్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం 1 నుంచి 8 తరగతుల ఒడియా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్ర పాఠశాల–సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్ దాస్ పచ్చజెండా ఊపి పాఠ్య పుస్తకాల పంపిణీ వాహనాల రవాణా ప్రారంభించారు.

క్లుప్తంగా

భార్యపై బాణంతో దాడిచేసిన భర్త


చికిత్స పొందుతున్న కళి కర్సమి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మెటు పోలీసుస్టేషన్ పరిధి కమలపురం గ్రామంలో గంగా కర్సమి అనే వ్యక్తి మద్యం మత్తులో ఆయన భార్య కళి కర్సమిపై శనివారం రాత్రి బాణంతో దాడి చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చి కడుపులోకి దూసుకుపోయిన బాణం చూసి, మెటు ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి బాణం బయటకు తీశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగుంది. గంగాపై కేసు నమోదు చేసిన పోలీసులు పట్టుకోవడానికి గాలిస్తున్నారు.

ఘనంగా మానికొమ్మల పండుగ


క్రైస్తవ భక్తుల ర్యాలీ

మక్కువ: మండలంలోని ఆర్‌సీఎం వీధికి చెందిన క్రైస్తవ భక్తులు ఆదివారం మానికొమ్మల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా గుడ్ ఫ్రైడేకు ముందు మానికొమ్మల పండుగ చేసుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు ఆర్‌సీఎం వీధి నుంచి సుమారు కిలోమీటరున్నర దూరంలో ఉన్న చర్చి వద్దకు మానికొమ్మలు చేతబూని ప్రార్థనలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సంఘటన స్థలంలో మృతిచెందిన దాలినాయుడు

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామానికి చెందిన రాజాన దాలినాయుడు (34) ఆదివారం సాయంత్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాలినాయుడు బోనంగి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో మోకాలపాడు జంక్షన్ వద్ద బోర్డును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచార మేరకు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పొట్టేళ్ల పందాల రాయుళ్లపై కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామంలో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై ఆదివారం తెల్లవారుజామున దోనుబాయి ఎస్సై కిశోర్‌వర్మ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు.ఈ దాడుల్లో రెండు పొట్టేళ్లు, రూ.2 వేలు స్వాధీనం చేసుకుని ఏడుగురు పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.పేకాట శిబిరాలు నిర్వహించడం, పొట్టేళ్ల పందేలు జరిపించడం, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తైక్వాండోలో విజయనగరం క్రీడాకారుల హవా


జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాజస్థాన్ రాష్ట్రంలోని కోట యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్చి నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ క్యాడెట్ పోటీల్లో విజయనగరానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు సీహెచ్ హర్షవర్ధన, బి యశస్విని, ఎం షణ్ముఖ సిద్ధార్థ వివిధ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో మూడు పతకాలు రావడం ఇదే మొదటిసారి అని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. సీహెచ్ వేణుగోపాలరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 20 సంవత్సరాలుగా తైక్వాండో క్రీడను విజయనగరం జిల్లాలో నేర్పిస్తున్నానని అంతేకాకుండా స్పోర్ట్స్ కోటాలో చాలావరకు ఉద్యోగాలు కూడా వచ్చాయని, అయితే జాతీయ స్థాయిలో మూడు పతకాలు రావడం అంతులేని ఆనందాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తానని చెప్పారు. వారి విజయం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం

బరంపురం: నగరంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్ర సమయంలో ఉపశమనం లభించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లినవారు వర్షపు నీటిలో చిక్కుకున్నారు. రహదారులపై వరద నీరు ప్రవహించడంతో ఇబ్బందులు తప్పలేదు.

మల్కన్‌గిరి: జిల్లాలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో పద్మగిరి పంచాయతీ పాఠశాల హాస్టల్ భవనం రేకులు ఎగిరిపోయాయి. అలాగే పలుచోట్ల ఇంటిపై రేకులు ఎగిరిపోవడంతో పాటు చెట్లు నేలకొరిగాయి. ఉడపా పంచాయతీలో సైతం భారీనష్టం సంభవించింది. దీంతో జిల్లావ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు వర్షం ప్రభావిత ప్రాంతాల్లో పయనించి పరిస్థితిని సమీక్షించారు. పరదాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించారు.


మల్కన్‌గిరి: ఇంటిపై రేకులు ఎగిరిపోయిన దృశ్యం


బరంపురం: కొమ్మపల్లిలో నిలిచిన వర్షపు నీరు


బరంపురం: హనుమాన్ బజార్‌లో వరద నీరు


మల్కన్‌గిరి: పద్మగిరి ప్రధాన రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న ఓడ్రాఫ్ బృందం


మల్కన్‌గిరి: రేకులు ఎగిరిపోయిన హాస్టల్ భవనం


బరంపురం: బీఎంసీ రోడ్‌లో కుండపోత వర్షం


మల్కన్‌గిరి: ఇళ్ల మధ్య పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం


మల్కన్‌గిరి: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

‘కొటియా’పై కట్టుబడి ఉండాలి

- కేంద్ర మంత్రి మాటలపై ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాలపై సుప్రీంకోర్టు స్టేటస్ ఉన్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు కమిటీలను నియమించి చర్చలతో సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. తన స్వగృహంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. ఈ గ్రామాలకు సంబంధించి ఇటీవల కేంద్ర మంత్రి దేవేంద్రప్రధాన్ మాటలు సరికాదన్నారు. కొటియా గ్రామాలు ఒడిశావే అంటూ పేర్కొనడం తగదన్నారు. కేంద్ర మంత్రి దేశంలో అన్ని ప్రాంతాలను సమానంగా చూడాల్సి ఉందన్నారు. కేంద్ర మంత్రి మాటలు కోర్టు ధిక్కారణ అవుతుందన్నారు. కొటియా గ్రామాల వివాదంపై 1968లో సుప్రీం కోర్టు స్టేటస్ కో విధించిందన్నారు. ఇరు రాష్ట్రాలకు సమాన హక్కులు ఉంటాయని తెలిపిందని చెప్పారు. అంత వరకు ఇరు రాష్ట్రాలు అక్కడ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారని వెల్లడించారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చాలా గౌరవం, అభిమానం ఉందని తెలిపారు. ఆంధ్రా – ఒడిశా మధ్య దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రెండేళ్ల కిందట ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి, నవీన్‌పట్నాయక్ చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, సామరస్య వాతావరణంలో కొటియా, పలు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవించని వారికి సరైన సమయంలో అవే బుద్ధి చెబుతాయని తెలిపారు.

రెండు ఆటోలు ఢీకొని ఏడుగురికి గాయాలు


బొండపల్లి: క్షతగాత్రుడు ప్రసాద్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద ఆదివారం రెండు ఆటోలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన గుర్ల గ్రామానికి చెందిన సారిక రాజేశ్వరి, సారిక హైమవతిలను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

రెండు బొలెరోలు ఢీకొని ఒకరికి..

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బొలెరో వ్యాన్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న వ్యాన్, విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న రెండు వ్యాన్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మజ్జి ప్రసాద్(28)తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

వసుధైక భావనే ప్రపంచానికి దిక్సూచి

- వివేకానంద కేంద్రం సంఘటక్ సుజాత నాయక్


సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: విస్తారమైన దేశంలో గల భారతీయ సనాతన వ్యవస్థలో వైవిధ్యం ఎంతో స్ఫూర్తివంతమైనదని స్వామి వివేకానంద కేంద్రం తెలుగు రాష్ట్రాల ప్రాంత సంఘటక్ సుజాత నాయక్ అన్నారు. అంతా ఒక్కటనే వసుధైక కుటుంబ భావనే ప్రపంచానికి దిక్సూచి కాగలదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో జీ–20 సదస్సులో భాగాంగా పార్వతీపురంలోని జట్టు ఆశ్రమంలో సివిల్ సొసైటీ–20 చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. జట్టు నిర్వాహకురాలు పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో ఏ రెండు అవయవాలు ఒకదానితో మరొకటి సమానంగా ఉండవని, అయితే ప్రతి అవయవం తనదైన పనిలో కీలకమైనదేనని గుర్తు చేశారు. అలాగే అన్ని ప్రాంతాలు, వర్గాల పరస్పర గౌరవం, సమన్వయంతోనే సమాజ ప్రగతి సాధ్యపడుతుందని తెలిపారు. అంతా మనం, మనవారనే భారతీయ తాత్విక చింతనే వసుధైక కుటుంబ భావన అని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


భారతీయతతో ప్రపంచాన్ని అనుసంధానం చేయడం, జనజీవనాన్ని అందులో భాగస్వామ్యం చేయడమే సివిల్ సొసైటీ–20 లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం సంస్కృతి, విద్య, వ్యవసాయ రంగాల ద్వారా చేరుకోగల మార్గాలపై చర్చించి, పలు ప్రతిపాదనలను జీ–20 సమన్వయకర్తలకు పంపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ వీఎస్ఎన్ కుమార్, దుర్గా బాబాజీ, లక్ష్మీ నారాయణ, రవికుమార్, పారినాయుడు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు


స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ దేవస్థానంలో ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో ఆదిత్యహృదయం హోమం చేశారు. అనంతరం ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

యల్లారమ్మ ఆలయంలో హుండీలో నగదు చోరీ


ఆలయంలో చోరీకి గురైన హుండీ

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ ఆలయంలో హుండీలోని నగదు చోరీకి గురైంది. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఆలయ పూజారి దుర్గారావు ఆదివారం ఎప్పటిలాగానే ఆలయానికి వెళ్లేసరికి గేటుకు ఉన్న తాళాలు లేకపోవడంతో ఎండోమెంట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఈఓ ప్రసాద్ ఆలయానికి చేరుకుని పరిశీలించి హుండీ చోరీకి గురైందని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీసీఎస్ ఎస్సై సుదర్శన్ ఘటనాస్థలానికి వచ్చి జరిగిన ఘటనపై ఎండోమెంట్ అధికారులు, ఆలయ పూజారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హుండీ పైకప్పు ఆలయం పక్కనే పడేసి ఉండడం గమనించారు. హుండీలో నగదు సుమారు రూ.70వేల నుంచి 80 వేలు ఉంటుందని ఈఓ తెలిపారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి ఆలయం గేట్లు, హుండీ తదితర ప్రాంతాలు వద్ద వేలిముద్రలు సేకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. సుమారు 65 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రిలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై అశోక్ కోరారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

జయపురం: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి హరిష బిసి ఆకాంక్షించారు. స్థానిక తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహిస్తున్న జయపురం సిటీ స్కూల్ 43వ వార్షికోత్సవంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. సిటీ హైస్కూల్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పటాన్నయక్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేష్ పట్నాయిక్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి.సునీత, సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ సశ్మిత సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొంగాగుడ ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ సూరు ఆదిత్యను సన్మానించారు. అలాగే పారిశుద్ధ్యంలో విశిష్ట పాత్ర నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిలో శ్రీనివాస్, ప్రకాశ్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో ఎల్.కోటలో విషాదఛాయలు


ఎల్.కోట జంక్షన్‌లో ఆయన నిర్మించిన బస్‌షెల్టర్

లక్కవరపుకోట: ప్రముఖ సినీనటుడు, నిర్మాత కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో లక్కవరపుకోట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కృష్ణ స్వస్థలం లక్కవరపుకోట గ్రామంలోని జామి వీధి. ఆయన చిన్నప్పుడే మంచి టైలరింగ్ చేస్తూ ఉండేవారని అప్పట్లో బతుకు తెరువుకోసం చెన్నై వెళ్లిపోయారని ఆయన బాల్యమిత్రులు తెలిపారు. అక్కడ సినీ ఇండస్ట్రీలో ‘ముద్దుబిడ్డ’ సినిమాకు కాస్ట్యూమ్స్ అందించారని చెప్పారు. అనంతరం భారత్‌బంద్ చిత్రంతో నటనా రంగంలోకి అడుగు పెట్టారని పెళ్లిపందిరి సినిమాతో నిర్మాణ రంగంలోనికి అడుగు పెట్టినట్లు దగ్గరి బంధువులు తెలిపారు. ఆయన ఎక్కడికి వెళ్లినా కన్న ఊరిని మర్చిపోలేదని గుర్తు చేసుకున్నారు. ఆయన తల్లి చినతల్లమ్మ పేరు మీద అరకు–విశాఖ రోడ్డులో ఎల్.కోట జంక్షన్ వద్ద బస్‌షెల్టర్‌ను 1996లో నిర్మించారు. అలాగే ఆయన చిన్నప్పుడు ఉండే ఇల్లు శిథిలమైపోవడంతో ఆ స్థలాన్ని గౌరమ్మ అమ్మవారి గుడి నిర్మాణానికి విరాళంగా అందజేశారన్నారు. అప్పుడు అప్పుడు ఎల్.కోట వచ్చి తనకు వారసత్వంగా వచ్చిన పంట భూములను చూసుకుంటూ వెళ్లేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.


కాస్ట్యూమ్స్ కృష్ణ (ఫైల్)

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం: భార్య సరదాగా ఉండడంలేదని మనస్తాపం చెందిన సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన బి.శ్రీనివాసరావు పురుగు మందు తాగి ఆదివారం ఆత్మహత్యా యత్నం చేశాడు. భర్త పురుగు మందు తాగిన విషయం గమనించిన భార్య స్థానికుల సహాయంతో 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించింది. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి



గెడ్డ వద్ద రాము మృతదేహం

లావేరు: మండలంలోని మురపాక గ్రామానికి చెందిన గనమాన రాము(35) ఆదివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన బి.నీలయ్య అనే పెద్దమేస్త్రీ వద్ద కాంక్రీట్ పనులకు కూలీగా వెళ్తుండేవాడు. ఆదివారం వేకువజామున 3.30 సమయంలో నీలయ్య రాముకు ఫోన్ చేసి పని కోసం వేరేచోటకు వెళ్లాలని, తొందరగా రావాలని చెప్పడంతో 4 గంటల సమయంలో రాము తన ద్విచక్రవాహనంతో బయలుదేరివెళ్లాడు. ఉదయం చిన్నయ్యపేట గ్రామానికి వెళుతున్న పోలీసులకు బయ్యన్నపేట జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించారు.సెల్‌ఫోన్ ఆన్‌చేసి చివరి డయల్ నంబర్‌కు కాల్ చేయగా మేస్త్రీ నీలయ్య లిఫ్టు చేశాడు. అతను రాము సోదరుడికి విషయం చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బయ్యన్నపేట, పెదరావుపల్లి గ్రామాల మధ్య వెతకగా పెద్ద గెడ్డ వద్ద రాము మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్ర, జేఆర్‌పురం సీఐ ఆదాం కూడా మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ అధికారులు, సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాము మృతితో కుటుంబం జీవనాధారం కోల్పోయింది. రామును ఎవరో చంపేసి గెడ్డ వద్ద పడేశారని భార్య, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ కోర్సు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ అనే నూతన కోర్సు ప్రవేశపెట్టినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, కంప్యూటర్ స్కిల్స్, వైద్య సంబంధిత పాఠ్యాంశాలతో పాటు ప్రాథమిక వైద్య చికిత్స విధానాలను నేర్పిస్తామని పేర్కొన్నారు. బీఎస్సీ పారామెడికల్ డిగ్రీ కోర్సులు, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీతో పాటు 12 పారామెడికల్ కోర్సుల్లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9121999654, 7680945357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భూసర్వే రాళ్లు తొలగిస్తే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రైతుల పొలాలు, ప్రభుత్వ స్థలాల హద్దురాళ్లు వేస్తున్నామని, వాటిని తొలగించడం నేరమని శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటలో తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, హద్దు రాళ్లు వేసే పనిలో రెవెన్యూ, సర్వే సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. అయితే కొన్నిచోట్ల ఆక్రమణదారులు, రైతులు హద్దు రాళ్లు తొలగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. భూ సర్వేచట్టం ప్రకారం అటువంటి వారు శిక్షార్హులని పేర్కొన్నారు.

ఘనంగా ధనరాజులమ్మ సంబరం



ఆకట్టుకున్న కోయనృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజులమ్మను ఆదివారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మపురం, తులసిగాం, జగన్నాథపురం, బిర్లంగి, ఒడిశా సుమాండీ, జయంతిపురం గ్రామ పరిసరాల నుంచి భక్తులు మేళతాళలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని ఊరేగింపుగా సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవారి సన్నిధిలో మొక్కుబడులు తీర్చుకున్నారు.

స్వయం ఉపాధి పొందాలి

ఆమదాలవలస: కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన కొబ్బరి రైతులు ఆ శిక్షణలో నేర్చుకున్న పద్ధతుల్లో చెట్లు ఎక్కుతూ, కొబ్బరి యాజమాన్యం చేస్తూ స్వయం ఉపాధి పొందేందుకు కృషిచేయాలని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బీవీకే భగవాన్ సూచించారు. కేవీకేలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న కొబ్బరి రైతుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారందరికీ ఆదివారం చెట్టు ఎక్కేందుకు ఉపయోగించే పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

సాగుకు సాయం



నరసన్నపేట మండలం నర్సింగపల్లిలో రైతు సంఘానికి (సీహెచ్‌సీ)కి మంజూరైన ట్రాక్టర్, ఇతర పరికరాలను అప్పగిస్తున్న ఏడీ, ఏఓ తదితరులు

- వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా రైతులకు పరికరాలు
- రెండో విడత పంపిణీకి రంగం సిద్ధం
- ఏప్రిల్‌లో మెగామేళా

నరసన్నపేట: అన్నదాతలకు రెండో విడత యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద.. రైతు భరోసా కేంద్రాల వారీగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు అవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని రెండో విడతలో యంత్రాల పంపిణీకి అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మొదటి విడతగా గత జూన్‌లో మెగా మేళా నిర్వహించి 225 ట్రాక్టర్లు, మరో 35 కోత, నూర్పు యంత్రాలు (కంబైండ్ హార్వెస్టర్లు) మరో 65 గ్రూపులకు ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఈ మేరకు రూ.10 కోట్లు సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం వెచ్చించింది. రెండో విడతలో 331 ఆర్‌బీకేల్లో యంత్ర పరికరాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకూ 155 గ్రూపులు ఆసక్తి చూపించాయి. పరికరాల మొత్తం ఖరీదులో 50 శాతం మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేశాయి. వీరిలో 144 గ్రూపులు ట్రాక్టర్ల కోసం డబ్బులు డిపాజిట్ చేశారు. వీరందరికీ యంత్రాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీ వరకూ డబ్బులు కట్టేందుకు రైతు సంఘాలకు అవకాశం ఇచ్చారు.

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



ఒకప్పుడు పెద్ద రైతులు మాత్రమే వ్యవసాయంలో యంత్రాలు ఉపయోగించేవారు. చిన్న, సన్న కారు రైతులు సీజన్‌లో యంత్ర పరికరాలు దొరక్క ఇబ్బంది పడేవారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేయడం ద్వారా పరికరాలు గ్రామాల్లో అందుబాటులోకి వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ అద్దెకే అధునాతన యంత్రాలు లభిస్తాయని రైతులు అంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా రానున్న ఖరీఫ్‌లో పనులు చేపట్టడానికి వీలుగా సీహెచ్‌సీల ద్వారా రైతులకు యంత్రాలు సబ్సిడీపై ఇస్తున్నాం. మొదటి విడత విజయవంతం కాగా ఇప్పుడు రెండో విడత పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల రెండు లేదా మూడో వారంలో మెగామేళా నిర్వహించి రైతులకు శ్రీకాకుళంలో యంత్రాలు పంపిణీ చేస్తాం. – కె.శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ

ట్రాక్టర్ మంజూరైంది



ఐదుగురితో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. మాకు ట్రాక్టర్‌తో పాటు నూర్పు యంత్రం, రోటావేటర్, ఫుల్ వీల్, ఆఫ్‌వీల్ సెట్‌లు, నాగలి సెట్, దమ్ము సెట్ అవసరమైంది. అధికారులకు చెబితే డబ్బులు కట్టాలన్నారు. కట్టాము. అవసరమైన పరికరాలు మంజూరు చేశారు. చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఈ విధంగా పరికరాలు సబ్సిడీతో అందించడంతో ఎంతో మేలు జరుగుతుంది.
– ముద్దాడ కృష్ణారావు, బొరిగివలస

గ్రామ స్థాయిలోనే యంత్ర సేవా కేంద్రాలు

జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలు ఉండగా మొదటి విడత పోనూ మిగిలిన ఆర్‌బీకేల్లో కస్టమర్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) 331 ఏర్పాటు చేశారు. దీంట్లో 155 సీహెచ్‌సీల్లో రైతులు ముందుకు వచ్చి ఇంప్లిమెంట్స్ కోసం డబ్బులు కట్టారు. ఈ మేరకు గ్రౌండింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతుంది. యూనిట్ ఖరీదులో 40 శాతం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరిస్తోంది. రైతు గ్రూపులు పది శాతం వాటా భరిస్తే మిగిలిన 50 శాతం మొత్తం లోను రూపంలో డీసీసీబీ సమకూర్చుతుంది. ఆర్‌బీకేల వారీగా సాగు చేసే ప్రధాన పంటలను బట్టి యంత్రాలు, యంత్ర పరికరాలు ఎంపిక చేసుకొనే అవకాశాన్ని రైతు గ్రూపులకు ఇచ్చారు.

ఘనంగా మట్టల ఆదివారం



జిల్లావ్యాప్తంగా క్రీస్తు ఆరాధనా మందిరాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం చిన్నబజారులో గల తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ ఎ.జాకబ్ సందేశాన్ని సూర్యమహల్ కూడలి వద్ద ఇచ్చారు. శ్రీకాకుళం కల్చరల్



శిలువను భుజాన వేసుకుని ఏసుక్రీస్తు వేషధారణలో నడుస్తున్న దృశ్యం



సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ

ఆధార్ అప్‌డేట్ చేశారా..?



కొయ్యాం సచివాలయానికి వచ్చిన ఆధార్ కార్డు లబ్ధిదారులు

- కార్డు పొంది పదేళ్లు పూర్తయితే చేయించాల్సిందే
- జూన్ 14 వరకు గడువు
- సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు
- ఆన్‌లైన్‌లో ఉచితం

ఎచ్చెర్ల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాలన్నా.. బ్యాంకింగ్ కార్యకలాపాలు కొనసాగించాలన్నా.. సెల్‌ఫోన్ సిమ్‌కార్డు పొందాలన్నా.. ఇలా ఒకటేమిటి ప్రతి అవసరానికి ఇప్పుడు ఆధార్ తప్పనిసరి. ఇంతటి కీలకమైన ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధార్ కార్డు పొంది పది సంవత్సరాలు గడిచిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని, లేదంటే ఆగస్టు నెలతో ఆధార్ కార్డు పని చేయదని ప్రభుత్వం చెబుతోంది.

ఉచితంగానే అప్‌డేట్..

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన అవసరం లేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈ నెల 15 నుంచి అప్‌డేట్ ప్రక్రియ ప్రారంభించారు. జూన్ 14 వరకు మూడు నెలల పాటు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్లో ఆధార్ అఫీషియల్ వైబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్‌లో ఎంఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను పూర్తిచేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అరచేతిలోనే ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించింది. బ్యాంకులు, కామన్ సర్వీస్ కేంద్రాలు, సచివాలయాల్లో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు.

గుర్తింపు పత్రం జత చేయాలి..

కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక అప్లికేషన్‌తో అప్పట్లో ఆధార్‌కార్డు మంజూరు చేశారు. అలాంటి వారితో పాటు కార్డు పొంది పదేళ్లు దాటిన వారు తప్పకుండా గుర్తింపు పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఆధార్‌కు జతచేసి డాక్యుమెంట్ అప్‌డేషన్ చేసుకోవాలి. లేనిపక్షంలో ఈ ఏడాది ఆగస్టు 31 తరువాత కార్డు చెల్లుబాటులో ఉండదని అధికారులు చెబుతున్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం..

ప్రస్తుత అప్‌డేషన్‌లో భాగంగా ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం ఉంది. చిరునామా, ఫోన్‌నంబర్, తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడీ, పాన్‌కార్డు, బ్యాంక్/పోస్టల్ పాస్‌బుక్, ఫొటోతో కూడిన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌కార్డు, గుర్తింపు పొందిన విద్యా సంస్థలు జారీచేసే పత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు తదితర 13 రకాల ధ్రువపత్రాల ద్వారా ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ అప్‌డేట్



ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ పొందిన పదేళ్ల కాలంలో ఎప్పుడైనా డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకున్న వారికి ఫర్వాలేదు. మిగిలిన వారు మాత్రం అప్‌డేట్ చేసుకోవాలి. మండలానికి ఆధార్ అప్‌డేట్ కిట్లు ఐదు మాత్రమే ఇవ్వడం వల్ల రోజుకు 5 సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఆధార్ అప్‌డేట్ చేయిస్తున్నాం.
– కుమార్ పట్నాయక్, ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ

నమో ఆదిత్యాయ..!

- అరసవల్లిలో భక్తజనం ప్రత్యేక పూజలు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు



కమిషనర్ అట్టాడ సిరికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. చైత్ర శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.2.44 లక్షలు, విరాళాలు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా రూ.73,161, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.10 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పలువురు ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అట్టాడ సిరి, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.అమరావతి రాజధాని లక్ష్యంగా కొందరు ఉద్యమకారులు ప్రత్యేక బస్సులో అరసవల్లి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, పరిపాలనాధికారి కిల్లారి రామారావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, వీఆర్వో చంద్రభూషణ్ తదితరులు పాల్గొ

డుమ్మా కొట్టారు.. డమ్మీ పెట్టారు!

- సర్వసభ్య సమావేశానికి హాజరుకాని వైద్యులు
- హెల్త్ సూపర్‌వైజర్ బదులుగా ఆమె భర్త హాజరు
- దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తీరుపై విమర్శలు



సభ్యులకు సమాధానమిస్తున్న సూపర్‌వైజర్ దమయంతి భర్త సూర్యం

సంతబొమ్మాళి: మూడు నెలలకోసారి జరుగుతున్న సాధారణ సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు, సిబ్బంది డుమ్మా కొట్టడం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దండుగోపాలపురం పీహెచ్‌సీకి చెందిన డాక్టర్లు, సిబ్బంది బాధ్యత మరిచి వ్యవహరించారు. వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో నౌపడ, దండుగోపాలపురం పీహెచ్‌సీల సిబ్బంది హాజరు కాగా, సంతబొమ్మాళి, బోరుభద్ర పీహెచ్‌సీల నుంచి ఎవరూ హాజరు కాలేదు. అయితే ఇక్కడే తమాషా జరిగింది. దండుగోపాలపురం పీహెచ్‌సీ డాక్టర్లు అజయ్‌కుమార్, సుధీర్‌లు ఇద్దరు సమావేశానికి హాజరు కాలేదు. సిబ్బందిని పంపలేదు. హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ దమయంతి తరఫున ఆమె భర్త సూర్యం హాజరయ్యారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయనే సమాధానాలు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి కానప్పటికి సభ్యుల ముందుకు వచ్చి సమాధానం చెప్పడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భార్యకు బదులుగా భర్త సమావేశానికి రావడం, సభ్యులు ఎవరూ గమనించకపోవడం ఇక్కడ కొసమెరుపు.

ఘనంగా ఆగ్నేయ స్థాలీపాక హోమం



ఆగ్నేయ స్థాలీపాక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆగ్నేయ స్థాలీపాక హోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకబృందం ఈ హోమాన్ని ఆలయ మండపంలో నిర్వహించారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో ఆదిత్యుని కల్యాణం జరిగిన మరునాడే ఈ హోమాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అలాగే అరుంధతి నక్షత్ర పూజలను నిర్వహించారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రత్యేక భోగాలను స్వామికి నివేదించారు. అంతకుముందు ఆదిత్యునికి ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 7.45 నుంచి 12.30 వరకు తరగతులు
- ప్రభుత్వ బడుల్లో పిల్లలు గోరుముద్ద తిన్నాకే ఇళ్లకు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సోమవారం నుంచి ఒంటి పూట బడులు మొదలుకానున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒక్కపూట తరగతులను నిర్వహించనున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో 12.30 తర్వాత మధ్యాహ్న భోజనం జగనన్న గోరుముద్ద అందజేయనున్నారు. అనంతరం విద్యార్థులను వారి ఇళ్లకు పంపిస్తారు. ఒంటిపూట బడుల సమయంలోనూ నిర్దేశించిన మెనూ ప్రకారమే భోజనాలు అందించాలని అధికారులు స్పష్టం చేశారు.

అన్ని యాజమాన్యాలకు వర్తింపు..

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్‌స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేట్, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలలతో సహా అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఒంటి పూట అమలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. సోమవారం నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఒంటిపూట బడులు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. అయితే పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజులపాటు 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు క్లాసులు ఉండవు.

కవితల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి పురస్కరించుకుని కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రస్తుత సమాజం–తీరుతెన్నులు'లపై అభ్యుదయ ఆలోచనల సరళితో రచనలు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ, అశ్లీల కవితలకు తావులేదని, అభ్యుదయ కవితలను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 25లోగా 'విశాలాంధ్ర బుక్ హౌస్, కేరాఫ్ అరసం, రామలక్ష్మణ థియేటర్ కూడలి, శ్రీకాకుళం' చిరునామాకు కవితలు పంపించాలన్నారు. విజేతలైన ఐదుగురికి నగదు బహుమతులుంటాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 30న శ్రీశ్రీ జయంతి సందర్భంగా విజేతల పేర్లు ప్రకటించి అదే రోజు సత్కరిస్తామని తెలిపారు. వివరాలకు 8008679666 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఖరీఫ్ సాగు కార్యాచరణ ప్రణాళికపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగు, రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగం లేని వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రకృతి సేద్యంలో భూసారం పెంచడం, పంటల యాజమాన్య ఖర్చులు తగ్గించటం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు దాతల చేయూత



కేన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ బూసయ్య ఐదేళ్ల కుమారుడు యోగేంద్రకు న్యూరో బ్యాస్టోమా అనే క్యాన్సర్ వ్యాధి సోకింది. ఈ చిన్నారి పరిస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఉద్దాన ప్రాంతం కవిటికి చెందిన ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ తరఫున రూ.20వేలు అందజేశారు. పవనపుత్ర సేవా సంస్థ వారు రూ.12వేలు ఆర్థిక సాయం అందించారు. కంచిలి మండలం అంపురం గ్రామస్తులు రూ.11,500లు సాయం చేశారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు రూరల్: బెండి గ్రామానికి చెందిన అల్లాడ మహాలక్ష్మి గత కొద్ది రోజులుగా కేన్సర్‌తో బాధ పడుతున్నారు. ఆమె దీనస్థితిపై 'సాక్షి'లో కథనం వెలువడడంతో బెండి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఆమెకు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. అంతా కలిసి రూ.1,09,170 విరాళంగా సేకరించి మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు.